హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఎసిబి అధికారులు

కదిరిలో ర్యాలీ చేస్తున్న సిపిఎం శ్రేణులు

సిపిఎం ప్రజారక్షణభేరికి

అపూర్వ స్పందన..!

సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరి యాత్రకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. బుధవారం ప్రారంభం అయిన యాత్ర గురు, శుక్రవారాల్లో మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో కొనసాగింది. యాత్ర వెళ్లిన ప్రతి ప్రాంతంలోనూ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్మికులు, రైతులు, ఉద్యోగులు, ప్రజలు ఇలా అన్ని వర్గాల వారూ వారి సమస్యలను యాత్ర బృందం సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. బస్సుయాత్ర నాయకత్వం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో స్థానిక సమస్యలను వివరిస్తూ, ప్రభుత్వాలు చేసిన మోసాన్ని తెలియజేస్తూ ప్రసంగించారు. ఈ ప్రసంగాలు ప్రజలను ఆలోచింపజేశాయి. ప్రభుత్వాలు చేస్తున్న మోసం వాస్తవమేనంటూ వారి అభిప్రాయాలను తెలియజేశారు.

- ఉమ్మడి జిల్లాలో ముగిసిన బస్సుయాత్ర
- యాత్రకు పెద్దఎత్తున ప్రజల సంఘీభావం
- ఆలోచింపజేసిన నాయకుల ప్రసంగాలు
- ఉమ్మడి జిల్లా ప్రజా సమస్యలను గర్తించిన బస్సుయాత్ర నాయకత్వం
- వెనుకబాటు, కరువును ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామన్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిది

సిపిఎం ప్రజారక్షణభేరి బస్సుయాత్ర బుధవారం సాయంత్రం అనంతపురం జిల్లాలోని తాడిపత్రిలో ప్రవేశించింది. శుక్రవారం కదిరితో ముగిసి అన్నమయ్య జిల్లాలోకి ప్రవేశించింది. మూడు రోజుల పాటు సాగిన ఈ యాత్ర ఎనిమిది నియోజకవర్గాల్లో సాగింది. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ నేతృత్వంలో సాగిన యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, దయా రమాదేవి, శివనాగవేణి, భాస్కరయ్యలు పాల్గొన్నారు. యాత్రలో ప్రధానంగా రాయలసీమ ప్రాంతం వెనుకబాటు కారణాలను ప్రజల ముందు ఉంచే ప్రయత్నంతో సాగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాంతాభివృద్ధికి ఇచ్చిన హామీల అమలు ఎంత వరకు వచ్చాయన్నది ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. రాయదుర్గం ప్రాంతంలో ఏర్పాటు చేస్తామన్న కుదురేముఖ్, హంద్రీనీవా వెడల్పు, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ తదితర అంశాలను ఈ పర్యటనలో ప్రజల ముందు ఉంచారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ప్రకటించిన నేపథ్యంలో అనేక మంది నిరుపేదలు ఇళ్ల కోసం ఎటువంటి ఇబ్బందులు పడుతున్నారన్నది యాత్ర బృందం ప్రస్తావించింది. గార్లదిన్నె మండలం కల్లూరులో నాలుగు సంవత్సరాలుగా ఉంటున్న నిరుపేదల ఇళ్లను కూల్చివేయడాన్ని తప్పుబట్టింది. అదే సమయంలో ఆ ప్రాంతాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ సందర్శించి, వారికి అండగా ఉంటామని భరోసానూ కల్పించారు. పెనుకొండ, చిలమత్తూరు తదితర ప్రాంతాల్లోనూ ఇళ్ల కోసం పేదలు చేస్తున్న పోరాటాన్ని బలపరిచారు. పేదల వైపు ఉంటామని చెప్పే ప్రభుత్వం ఎందుకు వారికి అండగా ఉండటం లేదని ప్రశ్నించింది. ఇక అదే సమయంలో కరువును ప్రధాన అజెండాగా ముందుకు తీసుకొచ్చింది. తీవ్రమైన కరువు పరిస్థితుల్లో కరువు మండలాల ప్రకటనలో కొన్ని మండలాలను మినహాయించడాన్ని తప్పుబట్టింది. తాము పర్యటిస్తున్న పుట్టపర్తి, కదిరి, నల్లమాడ మండలాల్లో తీవ్రమైన కరువున్నా ఎందుకు కరువు మండలాలు ప్రకటించలేదని ప్రశ్నించింది. ఈ ప్రాంతం నుంచి ఉపాధి కోసం వలసలు పోతున్న అంశాన్నీ ముందుకు తీసుకొచ్చింది. తక్షణం ఉపాధి హామీ పనులను కల్పించాలని యాత్ర బృందం ప్రస్తావించింది. కరువు నివారణ చర్యలు, ఉపాధి కల్పించే పరిశ్రమల ఆవశ్యకత , ఈ ప్రాంతాభివృద్ధికి పాలకులు తీసుకోవాల్సిన చర్యలు అన్నింటినీ ప్రజలకు వివరించి చైతన్య పరిచే ప్రయత్నం చేసింది. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ముందు అభివృద్ధి, ప్రజా సమస్యలు రాజకీయాల్లో ప్రధాన అజెండా కావాలని యాత్ర ఉద్దేశాన్ని ప్రజా రక్షణ భేరీ యాత్ర ప్రజలకు వివరించింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలను వదలి అధికారం కోసం పోటీపడుతున్నాయన్న విషయాన్ని ప్రజలకు వివరించే ప్రయత్నం చేసింది. ఈ సందర్భంగా అనేక చోట్ల ప్రజల నుంచి విశేషమైన స్పందన కనిపించింది. రాష్ట్రంలో ప్రధాన పార్టీలు అనుసరిస్తున్న విధానాలు, ఈ ప్రాంతాభివృద్ధి అంశాలు ఆందరినీ ఆలోచింపజేసే విధంగా నాయకులు చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. బహిరంగ సభ జరుగుతున్న ప్రాంతాల్లో సామాన్యులు కూడా ఈ అంశాలకు మద్దతుగా చర్చించుకోవడం కనిపించింది. యాత్ర బృందం దృష్టికి అనేక సమస్యలను కూడా ప్రజలు తీసుకెళ్లారు.

రాయలసీమకు అన్యాయం

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్

కదిరి టౌన్, నల్లమాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో రాయలసీమకు తీరని అన్యాయం జరుగుతోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఎం.గఫూర్ విమర్శించారు. సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరీ యాత్ర ఐదవ రోజుకు చేరుకుంది. శుక్రవారం ఉదయం శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ప్రారంభమైన యాత్ర నల్లమాడ మీదుగా కదిరికి చేరుకుంది. అక్కడి నుంచి అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువుకు వెళ్లింది. కదిరి, నల్లమాడలో నిర్వహించిన సభల్లో సిపిఎం నాయకులు ప్రసంగించారు. కదిరిలో గఫూర్ మాట్లాడుతూ కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, అనంతపురం జిల్లాకు హంద్రీనీవా తీసుకొస్తామని, రాయదుర్గం వద్ద కుదురేముఖ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, చిత్తూరులో బెల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, కర్నూలులో డిఫెన్సు ఫ్యాక్టరీ పెడతామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఇందులో ఏ ఒక్క హామీని అమలు జరపకుండా మోసం చేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతోన్మాద బిజెపి చెర నుంచి వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బయటకు రావాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలోని బిజెపి ప్రభుత్వం వంద లక్షల కోట్లు అప్పులు చేసి మరీ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన రాయలసీమ ప్రాంత ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. నల్లమాడలో జరిగిన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో సిపిఎం ప్రజా సమస్యలపైన నిరంతర పోరాటం సాగిస్తోందన్నారు. సబ్ ప్లాన్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. వెనుకబడిన రాయలసీమ లాంటి ప్రాంతాలకు కేంద్రం ప్రకటించిన మేరకు ప్రత్యేక ప్యాకేజీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా, కార్మిక, రైతు, ఉద్యోగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 15 తేదీన సిపిఎం ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నల్లమాడలో ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులుప్రభాకర్‌రెడ్డి, కృష్ణయ్య

'పురం'మున్సిపాల్టీలో ఎసిబి సోదాలు

- టౌన్ ప్లానింగ్ విభాగంపై ప్రత్యేక నిఘా
- ఎసిబి రాకతో అధికారులు, సిబ్బంది పరార్
- బోసిపోయిన మున్సిపల్ కార్యాలయం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు శుక్రవారం నాడు సోదాలు నిర్వహించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో ముగ్గురు ఎసిబి సిఐలు, ఒక ఎస్ఐ, 13 మంది సిబ్బంది బృందంగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. పట్టణంలో ఇళ్ల నిర్మాణాలు, లే అవుట్ అప్రువల్ తదితర వాటికి ధరఖాస్తు చేసుకున్న వాటిని కంప్యూటర్, ధరఖాస్తులను పరిశీలన చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విశ్వసనీయ వర్గాల ఫిర్యాదు మేరకు ఎసిబి అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. పరిశీలన అనంతరం ఎసిబి సిఐ మోహన్ ప్రసాద్ మాట్లాడుతు హిందూపురం పురపాలక సంఘంలో నిర్మాణాలకు అప్రూవల్ ఆలస్యం అవ్వడం, అప్రూవల్ కోసం అధికంగా డబ్బు వసూలు చేయడం, అనాధికారికంగా నివాస గహాలు, భవనాలు, రేకుల షెడ్లు నిర్మిస్తున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ గుర్తు తెలియని వ్యక్తులు టోల్ ఫ్రీ నెంబర్14400కు ఫిర్యాదు చేశారన్నారు. ఇదే విషయంపై వివిధ పత్రికల్లో కథనాలు కూడా వచ్చాయన్నారు. వీటన్నింటి నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హిందూపురం మున్సిపల్ కార్యాలయం టౌన్ ప్లానింగ్ విభాగంలో తనిఖీలు నిర్వహించామని చెప్పారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలన చేస్తే రూ.46వేలు లెక్క చూపనట్లు గుర్తించామన్నారు. ఇంకా పలు రికార్డులను పరిశీలన చేస్తున్నామన్నారు. రికార్డులను పరిశీలన చేస్తూనే క్షేత్రస్థాయిలోకి వెళ్లి ధరఖాస్తుదారులతోనూ మాట్లాడుతామని చెప్పారు. తనిఖీల అనంతరం ఏమైనా అవినీతి అక్రమాలు, లోటు పాట్లు ఉంటే ఉన్నతాధికారులకు సమచారం ఇచ్చి వారి సూచనల మేరకు కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో సిఐ మోహన్ ప్రసాద్‌తో పాటు సిఐలు ప్రభాకర్, శాంతిలాల్, ఎస్ఐ నరేంద్ర, 13 మంది సిబ్బంది పాల్గొన్నారు.

ఎసిబి అధికారుల రాకతో మున్సిపల్ అధికారుల పరార్

మున్సిపల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారుల బృందం రాకతో మున్సిపల్ కార్యాలయంలోని ఆయా విభాగాల్లో అధికారులు ఒక్కొక్కరుగా అక్కడి నుంచి జారుకున్నారు. ఎసిబి అధికారుల తనిఖీల నేపథ్యంలో పట్టణ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఎసిపి) కార్యాలయం నుంచి వెళ్లి పోయారు. కార్యలయానికి రావాలని సెల్ ఫోన్ ద్వారా సమచారం ఇచ్చినప్పటికీ ఆయన వస్తాను అన్ని చెప్పారే తప్పా సాయంత్రం అయినప్పటికీ రాలేదు. ప్రధాన విభాగంలో విధులు నిర్వహిస్తున్న క్లరికల్ సిబ్బంది కూడా ఒక్కొక్కరుగా జారుకున్నారు. రెవెన్యూ విభాగం గదిని ఎకంగా మూసివేశారు. మెప్మా, అకౌంటింగ్ విభాగాల్లో అధికారులు ఏ ఒక్కరూ కనిపించలేదు. ఎసిబి అధికారుల దెబ్బకు అధికారులతో పాటు కార్యాలయంలో కనీసం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు సైతం మాయం అయ్యారు. ఎసిబి అధికారులు వస్తే మున్సిపల్ అధికారులు అందరూ ఎందుకు కార్యాలయం నుంచి వెళ్లిపోయారన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పురం మున్సిపాల్టీలో పెద్ద ఎత్తున అవినీతి కార్యకలాపాలు జరుగుతండడం వల్లనే ఎసిబి అధికారుల దెబ్బకు మున్సిపల్ సిబ్బంది ఎవరూ కార్యాలయంలోకి వచ్చే సాహసం చేయలేదనే వాదన విన్పిస్తోంది.

ఎసిబి అధికారుల తనిఖీలతో అధికారులు లేక ఖాళీగా ఉన్న కూర్చీలు

రాష్ట్రంలో అభివృద్ధి కుంటు

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటు పడిందని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి పేర్కొన్నారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆయనకు పార్టీ శ్రేణులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రజలకు మినీ మేనిఫెస్టోని ప్రజలకు వివరించారు. బికె మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గ పాలన కొనసాగుతోందన్నారు. టిడిపి హయాంలో పెనుకొండ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, కియా పరిశ్రమను తీసుకొచ్చి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించామని, గొల్లపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేశామన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు వేశామని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు సిద్ధయ్య, సిద్ధలింగప్ప, టౌన్ కన్వీనర్ రవిశంకర్, నాయకులు కేశవయ్య, చిన్న వెంకటరాముడు, లక్ష్మినారాయణరెడ్డి, రామలింగ, శ్రీనివాసులు, బాబుల్‌రెడ్డి, హుజూర్, చంద్రకాంతమ్మ, ప్రభంజన్, షీఫారం శీన, చంద్ర, బాలునాయక్, జావీద్, ప్రసాద్, శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలకు టిడిపి మినీమేనిఫెస్టో పత్రాలను అందజేస్తున్న బికె పార్థసారథి

ముందడుగు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

హొట్టేబెట్టలో కాంగ్రెస్ 'ముందడుగు'

మడకశిర : కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రొళ్ల మండల పరిధిలోని హొట్టేబెట్ట పంచాయతీలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ఆధ్వర్యంలో 'ముందడుగు' కార్యక్రమం నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. అనంతరం కళ్లురొప్పం, కొత్తపాలెం, కెపి తండా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఎస్.గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాగి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

జెసి చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్

ప్రజాశక్తి-గుడిబండ

రైతులు పండించిన రాగి పంటకు ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తుందని జాయింట్ కలెక్టర్ చేతన్, పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ఖరీఫ్-2023 సీజన్‌లో రైతులు పండించిన రాగి పంటను కొనుగోలు చేసేందుకు మండల పరిధిలోని మోరుబాగల్ రైతు భరోసా కేంద్రంలో సివిల్ సప్లైస్ ద్వారా ఏర్పాటు చేసిన కేంద్రాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మొదటి విడతగా మందల పల్లి, మోరుబగల్ ఆర్‌బికెల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు స్థానిక ఆర్‌బికెలో అధికారులను సంప్రదించి రాగులను విక్రయించాల న్నారు. క్వింటాల్ రూ. 3,846 చొప్పున కొనుగోలు చేస్తారన్నారు. త్వరలోనే అన్ని ఆర్‌బికెల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లైస్ డిఎం అశ్వర్థ నారాయణనాయక్, ఎడిఎ శ్రీకృష్ణమీనన్, ఎంపిడిఒ రామారావు, తహశీల్దార్ నాగభూషణం, ఎఒ వీరనరేష్, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమరాపురం : రాగి పంటను కొనుగోలు చేసేందుకు రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ కోరారు. మండల పరిధిలోని కె.శివరం ఆర్‌బికెలో ఏర్పాటు చేసిన రాగి పంట కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కె.శివరం, హలుకూరు ఆర్‌బికెలను మొదటి విడతగా ప్రారంభించామని, త్వరలోనే అన్ని ఆర్‌బికెల్లో ప్రారంభిస్తామన్నారు. రాగుల రవాణా, హమాలీ, సంచుల ఖర్చును కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. నగదును రైతుల ఖాతాలోకి జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లైస్ డిఎం అశ్వర్థ నారాయణనాయక్, డిసిఒ కృష్ణానాయక్, ఎడిఎ శ్రీకృష్ణమీనన్, ఎంపిడిఒ మునిస్వామి, తహశీల్దార్ రమేష్‌బాబు, ఎఒ మంజునాథ్, జడ్పిటిసి సారక్క నరసింహమూర్తి, సర్పంచి మంజుల చిత్తన్న, ఎంపిటిసి కృష్ణమూర్తి, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతుల తీసుకొచ్చిన రాగులను పరిశీలిస్తున్న జెసి చేతన్

పరీక్షల నిర్వహణ భేష్ : డిఇఒ

మడకశిర : రాష్ట్ర విద్యాశాఖ అఛీవ్‌మెంట్ సర్వేలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో పరీక్షలను చాలా చక్కగా నిర్వహించారని జిల్లా విద్యాశాఖ అధికారి(డిఇఒ) మీనాక్షి కితాబునిచ్చారు. డిఇఒ శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించారు. అందులో భాగంగా పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరంలో 3, 6, 9 తరగతులకు నిర్వహిస్తున్న పరీక్షలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత అమిదాలగొంది జడ్పి హైస్కూల్‌లో జరుగుతున్న పరీక్షల తీరును పరిశీలించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 1069 పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించా మని, అన్ని కేంద్రాల్లో పరీక్షలను సజావుగా నిర్వహించారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ విధంగా పరీక్షలు నిర్వహించడం పట్ల విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. డిఇఒ వెంట ఎంఇఒ శ్రీనివాసభాస్కర్, నరసింహమూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.



పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న డిఇఒ మీనాక్షి

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎన్నికైన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌కు కోగిర విద్యార్థులు

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని కోగిర జడ్పి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక య్యారని శుక్రవారం హెచ్‌ఎం నారాయణరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. ఇటీవల అనంతపురంలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన క్రీడా పోటీల్లో జూనియర్ విభాగం బాల్ బ్యాడ్మింటన్‌లో అశోక్, సీనియర్ విభాగంలో ఎం.విజయ్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఆ విద్యార్థులను స్థానిక పాఠశాలలో హెచ్‌ఎం, పిడితో పాటు ఉపాధ్యాయులు వెంకటేశులు, పోతులయ్య, హసీనాబేగం, రమేష్, శివయ్య, రామంజనేయులు, ఆదినారాయణ, జాబిలి చాంద్‌బాషా అభినందించారు.

మండల మీట్‌కు అధికారుల డుమ్మా

సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-గోరంట్లరూరల్

మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరవకపోతే సమస్యలు ఎవరికి తెలపాలని సభ్యులు ఆగ్రహ వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి ప్రమీల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా సభ్యులు అధికారుల గైర్హాజరీపై ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తాను నిలదీశారు. ఇదే విషయమై జడ్పిటిసి జయరామ్‌నాయక్ సమావేశాన్ని బహిష్కరించగా ఎంపిడిఒ నచ్చజెప్పి తీసుకొచ్చారు. గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపిపి, జడ్పిటిసి తెలిపారు. ఎఒ మునికృష్ణ మాట్లాడుతూ బూదిలి, ముందలపల్లి పంచాయతీల్లో రాగి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, కిలో రూ. 38 ప్రకారం కొనుగోలు చేస్తామన్నారు. రబీ సీజన్‌కు ఆర్‌బికెల్లో మొక్కజొన్న విత్తనాలు ఇస్తామన్నారు. బూదిలి సింగిల్‌విండో అధ్యక్షులు రఘురామ్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమ య్యారని, ఇకనైనా ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని కోరారు. తహశీల్దార్ రంగనాయకు లు మాట్లాడుతూ పులేరు, మల్లాపల్లి, బూదిలి, నర్సంపల్లి, కొండాపురం, కమ్మవారిపల్లి గ్రామాల్లో రీ సర్వే పూర్తవగానే స్కెచ్, నూతన పట్టాదారు పాసుపుస్తకం ఇస్తామన్నారు. కదిరి-హిందూపురం, పుట్టపర్తి-కోడూరుకి 4 లైన్ల రహదారికి భూములు సేకరించా మని, రైతుల ఖాతాల్లోకి పరిహారం సొమ్ము జమ చేస్తామని తెలిపారు. వ్యవసాయ, విద్య, వైద్య, తదితర శాఖల అధికారులు తూతూ మంత్రంగా నివేదికలు చదివి వెళ్లిపోయారు. సమావేశంలో వైస్ ఎంపిపిలు రామలక్ష్మమ్మ, నాగభూషణ్‌రెడ్డి, మండల అగ్రి ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తాను ప్రశ్నిస్తున్న సభ్యులు

12న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో ఈనెల 12న నిర్వహించే ఉచితకంటి ఆపరేషన్ల వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జయసింహా, నాగభూషణ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సాంస్కృతిక మండలిలో ఉచిత కంటి ఆపరేషన్ల వైద్యశిబిరానికి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి, అనంతపురానికి చెందిన జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని కావున ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆర్గనైజర్స్ సత్రశాల ప్రసన్నకుమార్, రామకృష్ణ, మనోహరగుప్తా, బండారుచలం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

గాండ్లపెంట : మండల పరిధిలోని కల్లుబాయి తండా నుంచి గాజులవారిపల్లికి గ్రావెల్ మెటల్ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లుబాయి తండా నుంచి గాజులవారిపల్లి పెద్ద తండా వరకు దశాబ్దాల నుంచి రస్తా లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రామానికి చెందిన వైసిపి యువ నాయకులు ఆంజనేయులు నాయక్, గోపాల్ నాయక్, బాలకృష్ణ నాయక్ వారి సొంత నిధులతో గ్రామానికి రోడ్డు ఏర్పాటు చేయడానికి ముందుకురావటం అభినందనీయమన్నారు. వీరు దాదాపు రెండు కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ జి రవీందర్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, మాజీ జెడ్పిటిసి భాస్కర్ రెడ్డి, మండల ఆర్‌బికె చైర్మన్ వైవి శంకర నాయుడు, సచివాలయ కన్వీనర్ డాక్టర్ ఖాజావలి, మండల బీసీ నాయకుడు లక్ష్మి నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

తలుపుల : మండల పరిధిలోని గంజివారిపల్లి, గంజివారిపల్లి హెచ్ డబ్ల్యు, కొవ్వూరివాండ్లపల్లి, భూపతివాండ్లపల్లి, చంద్ర నాయక్ తండాలోని అంగన్వాడీ కేంద్రాలను సిడిపిఒ రాధిక శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలలో హాజరు పట్టికను పరిశీలించి పిల్లలకి అందిస్తున్న పోషకాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిహారిక తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యంపై పరీక్షలు

బత్తలపల్లి : విద్యార్థులల్లో దాగి ఉన్న సామర్థ్యాలను తెలుసుకునేందుకు ఎస్ఇఎస్ (స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షలను నిర్వహించారు. శుక్రవారం మండలంలోని 33 పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు (ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లో) ప్రధానోపాధ్యాయులు, ఫీల్డ్ ఇన్వెస్టిగేషర్స్ సమక్షంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో విద్యార్థులు చూపిన ప్రతిభ ఆధారంగా మండలం గ్రేడును నిర్ధారించడం జరుగుతుందని ఎంఇఒ సుధాకర్‌నాయక్ తెలిపారు.

నేటి నుంచి జ్యోతుల ఉత్సవం

బత్తలపల్లి : మండలంలోని యర్రాయపల్లిలో శ్రీదేవాంగ చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల ఉత్సవాలను శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

సత్య సాయి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

పుట్టపర్తి క్రైమ్ : జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ కోరారు. ఈ మేరకు ఆయన టిడిపి నాయకులతో కలసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్ఒ కొండయ్యకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ బాషా, బీసీ జిల్లా ఉపాధ్యక్షుడు దయ్యాల ఉమాపతి యాదవ్, పీటల రమణ, అంజి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి

హిందూపురం : పురపాలక సంఘ వ్యాప్తంగా సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని 17వ వార్డులో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి చైర్‌పర్సన్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇ వెంకటరాముడు, డిఇఇ రాణి, ఎఇ జనార్ధన్, వైసిపి నాయకులు చాంద్‌బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

కొత్తచెరువు : రోడ్డు ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగాఉండాలని ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు మండల పరిధిలోని తిప్పా పట్లపల్లి మరుకుంటపల్లి గ్రామాలలో శుక్రవారం రాత్రి గ్రామస్తులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

In the court of the Addl. Junior Civil Judge:Hindupuramu.
O.S.No:70/2021
Between:
B.Thulasi ...Plaintiff
v/s
J.H.Suryanarayana Reddy and others ...Defendants
Notice to Defendant No:4
To:
Manjula D/o Raja Reddy, R/o తిమ్మగానిపల్లి, లేపాక్షి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా పై దావా నందు 4వ ప్రతివాది సమను తీసుకోలేదు. కనుక 14/11/2023వ తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు నందు ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ హాజరై తమ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. అట్లు కాని యెడల వారి పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:14/11/2023
A.NAGARAJU, B.A.,L.L.B.,
ADVOCATE, HINDUPURAMU.

సచివాలయాల తలుపులు తెరిచేదెన్నడు..?

తలుపులు వేసిన గ్రామ సచివాలయ భవనం

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండల కేంద్రంలోని 1,2 సచివాలయాలు ఎప్పుడు పనిచేస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. ఎప్పుడు చూసినా ఈ కార్యాలయాల తలుపులు మూసివేసి ఉంటాయని అధికారులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని దుస్థితి నెలకొందని స్థానికులు విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలో 1,2 సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలో ఒకే చోట ఉన్నాయి. ఈ కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది విధులకు హాజరవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాలు సమయానికి తెరవకపోవడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు అధికారుల కోసం ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని విమర్శిస్తున్నారు. చివరకు అధికారులు రాకపోతే ఊసురుమంటూ తిరిగి వెళ్లిపోతున్నారని అంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో ఇక్కడి అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సచివాలయ, రైతు భరోసా కేంద్రం ఉద్యోగులు సమయానికి విధులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాటలతో ఎన్నాళ్లు మభ్యపెడతారు..?

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ

ప్రజాశక్తి - చిలమత్తూరు

గుడిసెలు వేసుకున్న పేదలందరికి 15 రోజులలో ఇంటి పట్టాలు ఇస్తామని వైసిపి హిందూపురం ఇంచార్జ్ దీపిక ఇచ్చిన హామీ ఏమైందని, మాటలతో ఎన్నాళ్లు మభ్య పెడతారని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ నిలదీశారు. మండలంలోని కోడూరు పంచాయతీ పరిధిలోని 805 సర్వే నెంబర్ జగనన్న లే అవుట్ లో ఇల్లు లేని నిరుపేదలు వేసుకున్న గుడిసెల వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రమణ మాట్లాడుతూ అధికారులు, నాయకుల హామీలు నీటిమీద రాతలుగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌ఛార్జి దీపిక ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని భావించామని తహశీల్దార్ చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేయిస్తామంటే పేదల సమస్య పరిష్కారం అవులుందని ఆనందపడ్డామని అన్నారు. అయితే ఆమె ఇచ్చిన హామీ ప్రకటనకే పరిమితమైందని విమర్శించారు. 270 కుటుంబాల సమస్యనే పరిష్కరించలేని ఇన్‌ఛార్జి రాబోయే కాలంలో ప్రజల సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తుందని అనుమానం వ్యక్తం చేశారు. మండలంలో జరిగిన సర్వసభ్య సమావేశం మరో సారి ఎంపిపి పురుషోత్తమ రెడ్డి పేదలందరికి ఇంటి పట్టాలు మరో స్థలంలో ఇవ్వటానికి స్థలం చూశామని చెప్పడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇన్ని రోజులు పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకపోవడానికి తెరవెనుక అధికార పార్టీ నాయకులే ఉన్నట్లు అనుమానం కలుగుతుందని అన్నారు. కోట్ల రూపాయల విలువ చేసే భూమినిబడా బాబులకు అప్పగించాలన్న అజెండా మేరకే వారు పనిచేస్తున్నట్లు తెలుస్తోందని అన్నారు. తాము శాంతి యుతంగా గుడిసెలలో జీవనం కొనసాగిస్తున్నామని అలా కాదని పేదల మనోభావాలు దెబ్బతీసేలా ప్రజాప్రతినిధులు, నాయకులు వ్యవహరిస్తే పరిస్థితి మరోలా ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు, నాయకులు స్పందించి గుర్తించిన మేరకు 805 జగనన్న లేఅవుట్ లోనే వెంటనే పట్టాలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, లక్ష్మినారాయణ, వెంకటేష్, రామచంద్ర, చందు, రియాజ్, శివ, రహంతుల్లా, సదాశివరెడ్డి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకుందాం

సమావేశంలో మాట్లాడుతున్న బాబావలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్రుల ఆత్మగౌరవంగా ఉన్న విశాఖ ఉక్కును పరిరక్షించుకుని కడప స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసే వరకు ఉద్యమం కొనసాగిద్దామని ఐక్య విద్యార్థి, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐతో పాటు సిపిఎం నరసింహప్ప, ఎఐఎస్ఎఫ్ రాజేంద్ర, చంద్రశేఖర్ రెడ్డి, ఎన్ఎస్‌యుఐ సంపత్, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కరువు, కాటకాలకు నిలయమైన రాయలసీమ జిల్లాల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లు గడుస్తున్నా రాయలసీమ జిల్లాల్లో కనీసం 5 వేల మందికి ఉపాధి చూపే ఒక్క పరిశ్రమ కూడా లేకపోవడం ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల మందికి ఉపాధి కల్పిస్తోందని తెలిపారు. లాభాల బాటలో నడుస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం ఈనెల 8న జరిగే విద్యాసంస్థల బంద్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వరుణ్, పవన్, గోపీ, చంద్రశేఖర్, తరుణ్, నిహాల్, చిన్న, పవన్ కుమార్ రెడ్డి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నల్లజోడు పవన్, ఉపాధ్యక్షులు నరసింహమూర్తి, నాయకులు దేవరాజ్, సిఐటియు నాయకులు రామకృష్ణ, బాబా తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 7న పుట్టపర్తికి వస్తున్న సందర్భంగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి కార్యక్రమాల ఆర్గనేటర్ రఘురాం, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు సంయుక్తంగా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ముందస్తు ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు మడకశిర తిప్పేస్వామి, కదిరి సిద్ధారెడ్డి, పుట్టపర్తి శ్రీధర్ రెడ్డి, రాప్తాడు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, పెనుకొండ శంకర్‌నారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, ఎస్పీ మాధవరెడ్డి, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, జిల్లాలోని ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాల గురించి ఆర్డినేటర్ రఘురాం వివరించారు. పుట్టపర్తి విమానాశ్రయం వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు ఎమ్మెల్యేలతో పాటు పలువురు ముఖ్య ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లకు తావు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సుబ్బారావు, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎమ్‌టి నాయక్, డిసిఒ కృష్ణ నాయక్, పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, పట్టు పరిశ్రమల శాఖ జెడి పద్మమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ రషీద్ ఖాన్, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, ఎపిఎంఐపి టీడీ సుదర్శన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, డిపిఒ విజయ్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలా జ్యోతి, సిపిఒ విజయ్ కుమార్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఖయ్యాం, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో ప్రజాస్వామ్యం అపహాస్యం : టిడిపి

మినీమేనిఫెస్టో కరపత్రాన్ని మహిళకు అందజేస్తున్న కందికుంట

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోందని టిడిపి నాయకులు విమర్శించారు. పట్టణంలోని 38వ వార్డులో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు, మినిమ్యానిపేస్టో గురించి ప్రజలకు వివరించారు. అక్రమ కేసులో చంద్రబాబును నిర్బంధించి జగన్ సర్కారు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ఆరోపించారు. జగన్ నియంతపాలనలో ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌కు ప్రజలే తగిన బుద్ధిచెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శీతామూర్తి, అత్తర్ రహీంబాషా, బిల్లేశీన, మున్నీ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 15వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో కందికుంట పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరుగుతూ మినీమేనిఫెస్టో కరత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, వార్డు ఇన్‌ఛార్జి హైదర్ వలి, యూనిట్ ఇన్‌ఛార్జి ముస్తఫా, మాజీ మహిళ కమిషన్ సభ్యురాలు పర్వీన్‌బాను, గంగరత్నమ్మ, ప్రేమలత, కుమారి,సుశీల, తెలుగుయువత పట్టణ అధ్యక్షులు కాటం మనోజ్, నాయకులు జావీద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేద్దాం

బస్సుయాత్ర కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, తదిత రులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజకీయంగా, రాజ్యాంగ బద్ధంగా ఉన్నత పదవులను కల్పించిన ప్రభుత్వం వైసిపినేననిఅందుకు సంఘీభావంగా తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులతో కలసి మాట్లాడారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఏర్పడిన తరువాత 25 మంది ఉన్న మంత్రి వర్గంలో 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చోటు కల్పించారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో మైనార్టీకి గానీ, ఎస్టీకి గానీ ఒక్క మంత్రి పదవి ఇచ్చిన పాపానపోలేదన్నారు. నియోజకవర్గంలో సైతం మున్సిపల్ చైర్‌పర్సన్లుగా ఇద్దరు బీసీ మహిళలకు అవకాశం ఇచ్చామన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రను శనివారం ధర్మవరం పట్టణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నేతలతో సమావేశం నిర్వహించి చైతన్యం పెంపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, పట్టణాధ్యక్షులు నీలూరి ప్రకాష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు బైముతక రమణ, కౌన్సిలర్లు గజ్జల శివ, మాసపల్లి సాయికుమార్, అత్తార్ జిలాన్‌బాషా, చింతా ఎల్లయ్య, కడప రంగస్వామి, బ్రహ్మయ్య, శంకర తేజేశ్వర్, కేత లోకేష్,చింత మారుతి ప్రసాద్, కుమారస్వామి, మేడాపురం వెంకటేష్, తదితర వార్డుల కౌన్సిలర్లు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రంసీన, ఈశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి,పట్టణంలోని 40 వార్డులకు చెందినవార్డు ఇన్‌ఛార్జులు కాచర్ల అంజి, కోటిరెడ్డి బాలిరెడ్డి, సరితాలబాషా, కృష్ణాపురం జమీర్‌బాషా, బడన్నపల్లి కేశవరెడ్డి, ఎస్పీ బాషా, తోపుదుర్తి వెంకట రాముడు, బాలం గోపాల్, జింక కంబగిరి బైముతక రమణ, కత్తే పెద్దన్న,బెస్త వెంకటరమణ, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేద్దామని బత్తలపల్లి మండల వైసిపి నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య. ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, నాయకులు బండి వీరనారప్ప, బండి నాగభూషణ తదితరులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ నాయకులు.. కార్యకర్తలు ప్రజలను చైతన్యవంతులను చేసి సభకు తరలించాలని పిలుపునిచ్చారు.

ముదిగుబ్బ : పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సాధికార బస్సుయాత్ర శనివారం ధర్మవరం పట్టణానికి చేరనుందని, ఈ యాత్రను విజయవంతం చేయాలని వైసిపి మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి కోరారు. మండల వ్యాప్తంగా ఉన్న వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్పిటిసి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు. సభ్యులు, వైసిపి నాయకులు కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని చిన్నూరు గ్రామానికి చెందిన రామాంజినేయులు ఎడ్లబండి పైనుండి జారిపడి ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన రామాంజినేయులు ఎండబండిపై వేసిన వేరుశెనగ పొట్టుపై కుర్చున్నాడు. అయితే గ్రామంలో గతుకుల రోడ్లు ఉండటంతో బండి పక్కకు వాలడంతో బండిపై కూర్చున్న రామాంజినేయులు జారికిందకు పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రామాంజినేయులును కుటుంబసభ్యులు ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

బత్తలపల్లి : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు శుక్రవారం మృతి చెందినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. బుక్కపట్నం మండలం మదిరేబైలు తండాకు చెందిన శంకరనాయక్(62) ఆర్డీటీ ఆసుపత్రిలో తన తమ్ముని కుమార్తె అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతుండగా చూడటానికి గురువారం ఆర్డీటి ఆసుపత్రికి వచ్చారు. గురువారం సాయంత్రం రోడ్డు దాటుతున్న సమయంలో బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వైపు వెలుతున్న ద్విచక్రవాహనం శంకరనాయక్‌కు ఢీ కొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను వెంటనే ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతునిభార్య సరోజాబాయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మేస్త్రీకి గాయాలు

గాండ్లపెంట : మండల కేంద్ర సమీపంలో ఉన్న చిన్న మిట్ట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. వద్దిరెడ్డిపల్లికి చెందిన అంజి అనే వ్యక్తి చిన్న మిట్ట వద్ద జగనన్న కాలనీ వద్ద మేస్త్రి పనికి వెళ్లి పనులు ముగించుకొని వస్తుండగా కదిరి నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చేయికి, కాలికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడున్న ప్రజలు ఆటోలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

డ్రైవర్లకు అవగాహన

గోరంట్ల : స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిఐ సుబ్బరాయుడు శుక్రవారం రోడ్డు ప్రమాదాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. సిఐ మాట్లాడుతూ ఎల్లో నంబర్ ప్లేట్ కలిగిన వాహనాలు మాత్రమే బాడుగకు వెళ్లాలని, వైట్ బోర్డు కలిగిన వాహనాలను సొంత అవసరాలకు మాత్రమే వినియోగించాలన్నారు. ప్రతి వాహనంపై నిఘా ఉంటుందని, తప్పు చేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

హిందూపురం : వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు నిబంధనలు తప్పని సరిగా పాటించాలని టూటౌన్ సిఐ వలీబాషా సూచించారు. శుక్రవారం టూటౌన్ పరిధిలోని అద్దె వాహనాల డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

గోరంట్ల రూరల్ : 'నాసన్' కంపెనీ కోసం భూములు కోల్పోయిన దళితులకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 'నాసన్' ఫ్యాక్టరీ కోసం చేపట్టిన బలవంతపు భూసేకరణలో మండల పరిధిలోని పాలసముద్రం గ్రామానికి చెందిన దళితులు వ్యవసాయ భూములను కోల్పోయారన్నారు. వీరికి 2013-భూసేకరణ చట్టం అమలు చేయకుండా నష్టపరిహారం కూడా చాలా తక్కువ ఇచ్చారన్నారు. ఎంతోమంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు, ఉన్నతాధికా రులు నాసన్ కంపెనీ భవన నిర్మాణ పనుల పర్యవేక్షణ కోసం ఇక్కడికి వస్తున్నారే కానీ దళితుల పునరావాసం, పరిహారం గురించి మాట్లాడే వారు కరువయ్యారన్నారు. దీంతో 168 మంది దళితులు పునరావాసం కోసం హైకోర్టును ఆశ్రయించారన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు దళితుల పునరావాసంపై స్పందిం చాలని కోరారు. ఈ విషయంపై శనివారం(నేడు) నాసన్ కంపెనీ పనుల పర్యవేక్షణకు వస్తున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి దళితులు తమ బాధలు చెప్పుకోవడానికి అవకాశం కల్పించాలని వారం క్రితమే డీఎస్పీకి విన్నవించాలమని, ఆయన స్పందించి అవకాశం ఇవ్వాలని కోరారు.

ఇసుకను ఉచితంగా ఇవ్వడమే నేరమా : సవితమ్మ

పెనుకొండ : ఇసుకను ఉచితంగా ఇవ్వడమే చంద్రబాబు చేసిన నేరమా అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ వైసిపి నాయకుల బినామీ కాంట్రాక్టు సంస్థలకు ఇసుక టెండర్లు, మద్యం దుకాణాల అనుమతులు, లీజులు ఇస్తూ అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారన్నారు. టిడిపి ప్రభుత్వంలో ఇసుక, మద్యం పాలసీలపై పారదర్శకంగా నిర్ణయాలు జరిగాయని, నిబంధనలకు లోబడే అనుమతులు, జిఒలు ఇచ్చారన్నారు. టిడిపికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఓటమి భయంతో సైకో సిఎం జగన్‌రెడ్డి కక్షతో చంద్రబాబుపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు.

నేటి నుంచి ఖాద్రీ ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు

కదిరి టౌన్ : పట్టణంలోని ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు , ధర్మప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. శనివారం నుంచి పదో తేదీ వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ చైర్మెన్ జెరిపిటి గోపాలక్రిష్ణ, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ధర్మవరం టౌన్ : ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ, వైస్ చైర్మన్ వేముల జయరామి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. పట్టణంలో శివానగర్, నేసే పేట సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కుండా చౌడయ్య, మున్సిపల్ ఆఫీస్ మేనేజర్ ఆనంద్ కుమార్, స్పెషల్ ఆఫీసర్లు ఆసిఫ్, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షను అందరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. శుక్రవారం 15వ వార్డు కౌన్సిలర్ షాజియా అధ్యక్షతన ఇందిరా నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెసిఎస్ కన్వీనర్ మారుతీ రెడ్డి, టౌన్ ఎ బ్లాక్ కన్వీనర్ సీఎం సాదిక్ సిపిసి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జనార్ధన్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్యసమావేశంలో సమస్యల వెల్లువ

చిలమత్తూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలు వెల్లువెత్తాయి. వర్షాభావం కారణంగా మండలంలో భూ గర్భజలాల స్థాయి పడిపోవడంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. పేదల ఇంటి సమస్యను పరిష్కరించాలని కోడూరు సర్పంచి మురళి అన్నారు. ఆ మేరకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు పేదల గుడిసెల వద్దకు వెళ్లి వారితో మాట్లాడి వారి మనోగతం తెలుసుకోవాలని అన్నారు. ఇందుకు సమాధానంగా ఎంపిపి పురుషోత్తమ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ అదికారులు మరో చోట స్థలం చూశారని అక్కడ ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపారని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ నరేష్‌క్రిష్ణతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం

హిందూపురం : స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ అనంతపురం జిల్లా ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో శుక్రవారం వ్యాధి గ్రస్తులకు వారి కుటుంబ సభ్యులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అలీఖాన్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గ్రామీణ విద్యార్థులు

ప్రతిభా విద్యార్థులతో రఘువీరా, తదితరులు

మడకశిర : మండల పరిధిలోని నీలకంఠాపురం జడ్పి హైస్కూల్ విద్యార్థులు కావ్య, గణేష్ జాతీయస్థాయి రైఫిల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శుక్రవారం తెలిపారు. మారుమూల ప్రాంతం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను మాజీ మంత్రి, ఎన్.రఘువీరారెడ్డి అభినందించారు.